నేడు కానిస్టేబుల్ అభ్యర్థులు హాజరుకావాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం మండలం తండ్యేంవలస జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో హాజరుకావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సమయంలో దరఖాస్తుతో జతచేసిన ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు మూడుసెట్లు జిరాక్స్‌లు తీసుకురావాలి. మూడు ఫొటోలు ఉండాలి. హాజరైన అభ్యర్థి అసిస్టేషన్ ఫారంలో పూర్తి వివరాలు పొందుపరిచిన తర్వాత గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేయించాలి' అని ఎస్పీ సూచించారు.

వాయుగండం గడిచింది



బాహుదా నదికి చేరిన వరద నీరు

- జిల్లాపై ప్రభావం చూపని తుఫాన్
- ఊపిరి పీల్చుకున్న అధికారులు, ప్రజలు

శ్రీకాకుళం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు వాయుగుండం ముప్పు తప్పింది. జిల్లా సరిహద్దులో వాయుగుండం మంగళవారం తీరం దాటనుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో అధికారులు రెడ్అలెర్ట్ ప్రకటించారు. జిల్లా అధికారులు (మిగతా 6వ పేజీలో..)



పుక్కళ్లపాలెం వద్ద కోతకు గురైన సముద్ర తీరం

బాహుదాకు పోటెత్తిన వరద

ఇచ్ఛాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాతోపాటు సరిహద్దున ఉన్న ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు బాహుదానదిలోకి భారీగా వరదనీరు చేరింది. ఒడిశాలోని బగలెట్టి డ్యాం గేట్లు ఎత్తివేయడంతో వరదనీరు పోటెత్తింది. బాహుదా నీటితో కళకళలాడుతోంది. నదిలో ఊటబావులు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. ఇటీవల ఎండల తీవ్రతకు బాహుదా ఎడారిలా మారడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం జలకళతో తమకు తాగునీటి సమస్య తీరుతుందని భావిస్తున్నారు.

వర్షనష్టం అంచనాలు పూర్తి చేయండి

- పీ-4లో జిల్లాకు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల వలన కలిగిన నష్టాల అంచనాలను పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలి. దోమల నివారణకు గంబూషియా చేపలు వదలాలి. నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి, క్లోరిన్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయాలి. ప్రతీ కార్యాలయాన్ని ఈ నెల 23వ తేదీలోగా శుభ్రం చేసుకోవాల'ని కలెక్టర్ ఆదేశించారు. 'పీ-4 పథకం అమలులో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో నిలిచింది. 61,552 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా 104 శాతం లక్ష్యాలను సాధించాం. దీంతో 1,55,804 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పొదల తొలగింపు, తోటల పెంపకం పనులు వేగంగా సాగుతున్నాయి. వందల కిలోమీటర్ల మేర రహదారులను శుభ్రం చేయడం, వేలాది మొక్కలు నాటాం. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో కూడా జిల్లా మంచి పురోగతి సాధించింది. 65,569 ఫిర్యాదుల్లో 64,074 ఫిర్యాదులు పరిష్కారమయ్యాయి. అన్ని శాఖలు శతశాతం లక్ష్యాలను సాధించాల'ని కలెక్టర్ ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ఆధార్ సీడింగ్‌పై ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, జయదేవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కోతకు గురైన తీరం

కవిటి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జిల్లాలో గత మూడు రోజులు విస్తారంగా వర్షాలు కురిశాయి. మంగళవారం కవిటి మండలంలోని పుక్కళ్లపాలెం, జాలారిపాలెం వద్ద సముద్ర తీరం కోతకు గురైంది. కెరటాల ఉధృతితో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలల ఎగసిపడుతుండడంతో మత్స్యకారులు భయాందోళన చెందారు.

ట్రస్టు భూమి అన్యాక్రాంతం



220-4 సర్వేనెంబర్ భూమి ఇదే

- రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ

220-4 సర్వేనంబరులో 13 సెంట్ల స్థలం పాత ఫసలీ, అడంగల్‌లో కలగర్ల సూర్యనారాయణశెట్టి ట్రస్టుకు చెందినవిగా ఉన్నాయి. ప్రస్తుతం మా వద్ద ఉన్న 1399, 1400 ఫసలీలోనూ కేఎస్‌పీ ఎస్ఎన్ చౌటరీ భూములుగానే నమోదయ్యాయి. కొత్తగా విశాఖ వ్యక్తికి 1-బీ ఎవరు ఇచ్చారనేది తెలియడంలేదు. దీనిపై విచారణ చేస్తున్నాం. ప్రస్తుతం 220-4 సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ జరగకుండా రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ రాస్తున్నాము. ఈ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటాం. అవసరమైతే రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కలెక్టర్‌కు, ప్రభుత్వానికి లేఖ రాస్తాం.

- ఆర్.వెంకటేష్, తహసీల్దార్, పొందూరు

- భార్య పేరిట విశాఖవాసి రిజిస్ట్రేషన్
- పొందూరులో రూ.2.5 కోట్ల స్థలం ఆక్రమణ
- రిజిస్ట్రార్ కార్యాలయానికి తహసీల్దార్ లేఖ

పొందూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అది ఓ ట్రస్టుకు చెందిన రూ.కోట్ల విలువైన స్థలం. ఇలాంటివి క్రయవిక్రయాలు చేపట్టకూడదు. లీజుకు మాత్రమే ఇవ్వొచ్చు. కానీ విశాఖలో ఉంటున్న ఓ వ్యక్తి ఈ స్థలాన్ని తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది. రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని లేఖ రాస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పొందూరు అంబేడ్కర్ కూడలిలో రోడ్డుకు ఆనుకుని 220-4 సర్వేనెంబర్‌లో 13 సెంట్ల స్థలం ఉంది. ఇది కలగర్ల సూర్యనారాయణ శెట్టి ట్రస్టు (కేఎస్ పీఎస్ఎన్ చౌటరీ) పేరిట ఉంది. దీనివిలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2.5 కోట్లు ఉంటుందని అంచనా. గతంలో రెవెన్యూ రికార్డు(ఫసలీ, అడంగల్)ల్లో కేఎస్‌పీఎస్ఎన్ చౌటరీ పేరున ఉంది. నిబంధనల మేరకు దేవదాయ, ట్రస్టు భూములు క్రయవిక్రయాలు చేయకూడదు. లీజుకు మాత్రమే ఇవ్వడానికి అవకాశం ఉంది. కానీ విశాఖలో స్థిరనివాసం ఉంటున్న వ్యక్తి 2021లో ఈ స్థలానికి 1-బీ చేయించుకున్నారు. ఆ స్థలాన్ని తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటినుంచి దీన్ని విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇది కేఎస్‌పీ ఎస్ఎన్ చౌటరీ స్థలమని తెలియడం, 1-బీతో రిజిస్ట్రేషన్ తప్ప మరే ఇతర డాక్యుమెంట్లు లేకపోవడం వల్ల పరిసర ప్రాంత ప్రజలెవరూ కొనుగోలుకు ముందుకు రాలేదు. ఈ స్థలంలో పొందూరుకు చెందిన ఎ. నారాయణరావు, కనకరాజు ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. ఈ వ్యవహారంపై కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెలుగు లోకి వచ్చింది.

కోల్‌కతా టు తమిళనాడు

- విదేశీ రామచిలుకలు అక్రమ రవాణా
- లాడ్జి యజమాని ఫిర్యాదుతో గుట్టురట్టు
- 236 పక్షులు పట్టుకున్న అటవీ సిబ్బంది



కారు డిక్కీలో ఉన్న విదేశీ రామచిలుకలను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది



పలాస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విదేశీ రామచిలుకల అక్రమ రవాణా గుట్టురట్టయింది. అరుదైన ఆస్ట్రేలియన్ ఫించెస్, కోన్యూర్ జాతికి చెందిన విదేశీ రామచిలుకలను కారులో కోల్‌కతా నుంచి తమిళనాడుకు తరలిస్తుండగా.. పలాసలో అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాయి. కోల్‌కతాకు చెందిన ఇద్దరి వ్యక్తుల వద్ద మొత్తం 236 పక్షులను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కోల్‌కతా (పశ్చిమబెంగ)కు చెందిన రేంటిదాస్, అమృత్‌గ్యాన్ అరుదైన ఆస్ట్రేలియన్ ఫించెస్, కోన్యూర్ జాతికి చెందిన విదేశీ రామచిలుకలను తమిళనాడు తరలిస్తున్నారు. వాటిని పంజరాల్లో బంధించి ఎవరికీ అనుమానం రాకుండా కారు (డబ్ల్యూబీ 19 క్యూ 2995) వెనుకభాగంలోని డిక్కీలో పెట్టి సోమవారం వేకువజామున పయనమయ్యారు. సోమవారం రాత్రి పలాసలో నీలావతి రైల్వేగేటు వద్ద అమరావతి లాడ్జిలో బస చేశారు. పార్కింగ్ చేసిన కారులో నుంచి అర్ధరాత్రి సమయంలో పక్షుల కూతలు వినిపించాయి. లాడ్జి సిబ్బంది ఆ కారును పరిశీలించగా వందల సంఖ్యలో రామచిలుకలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం లాడ్జి యాజమాని.. అటవీ శాఖసిబ్బందికి ఈ సమాచారం అందించారు. మంగళవారం ఉదయం కాశీబుగ్గ అటవీశాఖ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు, తన సిబ్బందితో కలిసి కారును పరిశీలించారు. అందులో 236 విదేశీ రామచిలుకలు కిక్కిరిసి ఉన్నట్టు గుర్తించారు. పక్షులను తరలిస్తున్న ఆ ఇద్దరినీ ప్రశ్నించగా పొంతనలేని సమాధానం ఇచ్చారు. దీంతో వారిద్దరినీ, కారును అదుపులోకి తీసుకున్నారు. కాశీబుగ్గ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. వారి రికార్డులు పరిశీలించగా రవాణాకు సంబంధించి ఎటువంటి పత్రాలు లభించలేదు. రూ.లక్షల విలువైన ఈ పక్షులను అక్రమ మార్గాన రాత్రి వేళ వీటిని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు వన్యప్రాణుల రక్షణ చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసి, పక్షులను విశాఖపట్నం జంతు ప్రదర్శనశాలకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సీడబ్ల్యూఎల్‌డబ్ల్యూ అనుమతులు తప్పనిసరి

మన రాష్ట్రంలో పక్షులు, జంతువులు ఇతర రాష్ట్రాల నుంచి రోడ్డు మార్గం గుండా తరలించడానికి చీఫ్‌వైల్డ్‌లైఫ్(సీడబ్ల్యూఎల్‌డబ్ల్యూ) వార్డెన్ అనుమతులు తప్పని సరిగా ఉండాల్సిందే. లేదంటే అవి అక్రమ రవాణా కింద పరిగణించ బడతాయి. ప్రస్తుతం తరలిస్తున్న ఆస్ట్రేలియాజాతికి చెందిన పక్షులు కూడా ఆ కోవలోకి (మిగతా 6వ పేజీలో..)

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నేడు జిల్లాకు రాక

శ్రీకాకుళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం శ్రీకాకుళం రానున్నారు. బుధవారం ఉదయం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నారాయణతిరుమల ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నగర సాంఘిక్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం శాంతినగర్ కాలనీలో గాంధీ మందిరంలో 'ఛాయ్ పే చర్చా' కార్యక్రమం నిర్వహించి.. నగరంలో ప్రముఖులతో సమావేశమవుతారు. అనంతరం 10 గంటల నుంచి 11 వరకు డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి మిల్లు జంక్షన్ వరకు బీజేపీ కార్యకర్తలు నిర్వహించే ర్యాలీలో పాల్గొంటారు. హోటల్ సన్‌రైజ్‌లో జిల్లా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం విలేకరుల సమావేశం అనంతరం మేధావి వర్గంతో సమావేశమవుతారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక మాధవ్ తొలిసారిగా జిల్లాకు వస్తుండటంతో పార్టీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేపట్టారు.

అధికారుల తప్పిదం.. రైతుల పాలిట శాపం

- వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా భూసర్వే
- జాయింట్ ఎల్‌పీఎంలతో ఇబ్బందులు
- 1బీలు రాకపోవడంతో ఇక్కట్లు
- ప్రభుత్వ పథకాలు, రాయితీలకు దూరమవుతున్న వైనం

గార రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న శాశ్వత భూ హక్కు.. భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన భూ సర్వే తప్పుల తడకగా ఉన్న విషయం తెలిసిందే. అస్తవ్యస్తంగా జరిగిన ఈ సర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)తో రైతులు అన్ని విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గార మండలంలో ఎల్‌పీఎంల కారణంగా రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలకు దూరమవుతున్నారు. 1బీలు రాకపోవడంతో ధాన్యం అమ్ముకోలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేకపోతున్నారు.



భూ సమస్యపై సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

ఇదీ పరిస్థితి..

వైసీపీ ప్రభుత్వ హయాంలో గార మండలంలో చేపట్టిన భూసర్వేకు సొంత మండల సర్వేయర్లు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చారు. వారు కొత్తవారు కావడంతో భూముల వివరాలు, యజమానుల వివరాలు తెలుసుకోకుండా డ్రోన్ల సాయంతో సర్వే నిర్వహించి తప్పులతడకగా రికార్డులు తయారు చేశారు. ఒక సర్వే నెంబరుకు సంబంధించి భూవిస్తీర్ణంలో పార్టీషన్ విభాగంలో అంటే ఏ,బీ,సీ,డీ భాగాలుగా ఉన్న రైతులందరికీ వేర్వేరు ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించాలి. కానీ, రెవెన్యూ అధికారులు మాత్రం ఒక సర్వే నెంబర్‌లో ఎంత విస్తర్ణం భూమి ఉందో, దానంతటికీ కలిపి ఒకే జాయింట్ ఎల్‌పీఎం కేటాయించారు. ఫలితంగా ఒక సర్వే నెంబర్‌తో ఎక్కువమంది రైతుల భూములు ఉంటున్నాయి. వారి పట్టాదారు ఖాతా నెంబర్లన్నీ కలిపి ఉండడంతో ఆన్‌లైన్‌లో ఒకే భూమి అందరికీ ఒక మొత్తంలో కనిపిస్తోంది. అంతేకాకుండా కొన్నిచోట్ల భూయజమాని ఒకరైతే మరొకరి పేరు మీద ఎల్‌పీఎం నెంబర్ ఉంటుంది. దీంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఏర్పడుతున్నాయి.

పథకాలకు దూరమవుతున్న రైతులు

గార మండలం వ్యాప్తంగా వ్యవసాయాధికారుల రికార్డుల ప్రకారం 16,459మంది రైతులు ఉన్నారు. వీరిలో 10,295మంది రైతులకు మాత్రమే పీఎం (మిగతా 6వ పేజీలో..)



అన్నదాత సుఖీభవ అందలేదు

గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూసర్వేలో లోపాలు ఉన్నాయి. నా భూమి వేరే వ్యక్తి పేరు మీద నమోదైంది. దీంతో నాకు పట్టాదారు పాసుపుస్తకం, 1బీ రాలేదు. దీని కారణంగా అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు అందలేదు

- కల్లి భీమారెడ్డి, రైతు, కల్లివానిపేట

భూమి వదులుకోమంటున్నారు

గతంలో జరిగిన భూసర్వే కారణంగా నాకు, మాపక్క రైతుకు జాయింట్‌గా ఎల్‌పీఎం నెంబర్‌ను కేటాయించారు. సమస్య పరిష్కరించండి.. వేర్వేరు ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కొంత భూమి వదులుకోమని అధికారులు అంటున్నారు.

- కల్లి, చిన్నయ్యరెడ్డి, రైతు, కల్లివానిపేట



ఇటు సేంద్రియం... అటు ప్రకృతి వ్యవసాయం

- రసాయనాల్లేని సాగుతో అధిక దిగుబడులు
- లాభాలను చూస్తున్న రైతులు

6లో

అయ్యో చిన్నారి

- కంపోస్టు గోతిలోపడి బాలుడి మృతి
- తల్లి కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వైనం

రాధాసాగరంలో వ్యక్తి గల్లంతు

ఎరువులు ఎప్పుడిస్తారు?

- అధికారులను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మండల సమావేశం

8లో

రహదారులిలా.. ప్రయాణమెలా?

- దారుణంగా ఉన్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

వేతన బకాయిలు చెల్లించాలి

- రిమ్స్ వద్ద ఖాళీ కంచాలతో సెక్యూరిటీ గార్డుల నిరసన

7లో

ఇటు సేంద్రియం.. అటు ప్రకృతి వ్యవసాయం

అన్నదాతలు ఇప్పుడు ప్రకృతి వ్యవసాయం వైపు చూస్తున్నారు. రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి... ప్రకృతి సాగువైపు అడుగులు వేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారి సంఖ్య పెరగడమే దీనికి తార్కాణం. తక్కువ పెట్టుబడితో... మంచి లాభాలు రావడమే కారణం.

● నూతన విధానంలో సాగుతో అధిక దిగుబడులు ● లాభాలను చూస్తున్న రైతులు

గార రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి)

పంటల సాగులో విచక్షణా రహితంగా రసాయన ఎరువులు... సస్యరక్షణ మందుల వాడకంతో ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయి. ఖర్చులు పెరిగి.. రాబడులు తగ్గుతున్నాయి. ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తున్న రసాయనాల మిళితమైన ఆహారానికి విరుగుడు సహజ పంటలేనని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఇందులో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. పెట్టుబడి తగ్గించి... వ్యవసాయం, ఉద్యానవన పంటలు లాభదాయకంగా ఉండేందుకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ ఎరువులకు సంబంధించి వర్మీ కంపోస్టు తయారీ, వాడకం, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, పుల్లటి మజ్జిగ, అగ్ని అస్త్రం, వంటివి తయారీపై ఆసక్తి గల రైతులకు శిక్షణ ఇస్తున్నారు. గార మండలంలో శాలిహుండం, శ్రీకూర్మం పంచాయతీ తండేలపేట, నిజామాబాద్, పూసర్లపాడు తదితర గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు సాధిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



జీవామృతం తయారు చేస్తున్నరైతు



డ్రాగన్ ఫ్రూట్ తోట



జామ తోట

మూడు ఎకరాల్లోనే..

శ్రీకూర్మం పంచాయతీ తండేలపేటకు చెందిన గొలివి భాస్కరరావు అనే రైతు తన 3 ఎకరాల మెట్టు భూమిలో ఎకరంలో డ్రాగన్ ఫ్రూట్, ఎకరంలో బొప్పాయి, ఎకరంలో జామి తోటను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నారు. వాటికి అవసరమైన ఎరువులను వ్యవసాయాధికారుల సూచన మేరకు తయారు చేసుకొని అధిక దిగుబడులు, లాభాలు పొందుతున్నాడు. జామిలో అంతర పంటగా 32 రకాల నవధాన్యాలు, బొప్పాయిలో బంతి, చామంతి రకాల పువ్వు జాతి మొక్కలను సాగు చేస్తూ పెట్టుబడి ఖర్చు తగ్గించుకుంటూ... తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

లాభాలు వస్తున్నాయి..



వరి సాగుకు గతంలో అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడేవాడిని. దీంతో పెట్టుబడి పెరిగిపోయి పంట గిట్టుబాటు అయ్యేది కాదు. డ్రిప్ విధానంలో నీటిని అందిస్తూ మూడేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి, జామ వంటి ఉద్యాన పంటలను సాగుచేస్తున్నాను. వ్యవసాయాధికారులు, ఎన్‌పీఎం సిబ్బంది సూచనల మేరకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. సేంద్రీయ ఎరువులు, ద్రవాలు తయారు చేస్తున్నాను. పురుగు నివారణతో పాటు, మొక్క ఏపుగా పెరగడానికి, పువ్వు పిందె రావడానికి, వాటిని స్ప్రే చేస్తున్నాను. డ్రాగన్ ఫ్రూట్ పంట కాలం ఏప్రిల్ నుంచి డిసెంబర్. ఏడాదికి 4 టన్నుల వరకు దిగుబడి ఉంటుంది. జామి, బొప్పాయి నిత్య పంట. బండ్లు, సైకిళ్ల మీద వ్యాపారం చేసే వారు తీసుకెళుతున్నారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంది.

-గొలివి భాస్కరరావు

రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి..



మండలంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఒకప్పుడు రెండు మూడు గ్రామాల్లో మాత్రమే రైతులు ఇలా సాగుచేసేవారు. ఇప్పుడు దాదాపు పది గ్రామాల వరకు విస్తరించింది. ద్రవ, జీవామృతాల తయారీ, వాడకం వంటి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాను. ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

-గుజ్జల కల్యాణి, ఐసీఆర్పీ, ప్రకృతి వ్యవసాయం

మత్స్యకారులకు అల్పపీడనం

● వేట సాగక ఇక్కట్లు



భావనపాడు తీరంలో లంగరు వేసిన బోట్లు

సంతబొమ్మాళి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనాలు... సముద్రంలో వేటకు తరచూ ఆటంకాలతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 193 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉంది. సంతబొమ్మాళి, పోలాకి, గార, రణస్థలం, వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని మత్స్యకారులు సముద్ర వేటపైనే జీవనం సాగిస్తున్నారు. జూన్ 15వ తేదీన వేట నిషేధం ముగియడంతో మొదట్లో వేట బాగానే సాగింది. ఆ తరువాత నుంచి అవాంతరాలు తలెత్తుతున్నాయి. అల్ప పీడనాలు, వాయుగుండాల కారణంగా తరుచూ వేటకు అంతరాయం కలుగుతోంది. అల్ప పీడనాలు ముగిసినా... చాలా రోజుల పాటు అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో సముద్రంలో వేటకు వెళ్లాలంటేనే మత్స్యకారులు భయపడుతున్నారు. ఇటీవల కాలంలో అలల తాకిడికి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బోట్లు బోల్తా పడి.. మత్స్యకారులు మృత్యువాత పడడం.. గాయపడడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఏమాత్రం తుఫాన్ హెచ్చరికలు వెలువడినా సముద్రం వైపు చూడడానికే భీతిల్లుతున్నారు. దీంతో వేటకు దూరమై... ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. డీజిల్ ధరలు కూడా ఎక్కువగా ఉండడంతో మరబోట్లు వినియోగించే వారికి నిర్వహణ భారం పెరుగుతోంది. అటు వేట సాగక... ఇటు ఆర్థికంగా తోడ్పాటు లేక అప్పులు చేయాల్సిన దుస్థితి తలెత్తుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని వారంతా కోరుతున్నారు,

ఉచితంగా రేషన్ పంపిణీ చేయాలి



సముద్రంలో తరచూ ప్రతికూల పరిస్థితులు ఎదురవుతుండడంతో వేట లేక.. పూట గడవడమే కష్టమవుతోంది. తుఫాన్‌కు ముందు రెండు రోజులు, తరువాత రెండు రోజులు మొత్తం వారం రోజుల పాటు సముద్రంలోకి వేటకు వెళ్లలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. తుఫాన్ సమయాల్లో మత్స్యకార కుటుంబాలకు వారానికి సరిపడే బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-ధనరాజ్, టీడీపీ మత్స్యకార ప్రతినిధి

500 మందితో సామూహిక అష్టలక్ష్మీ వ్రతాలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా 500 మంది మహిళలతో సామూహిక అష్టలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. మంగళవారం వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి సిందూర మర్దన, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు జరిపించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు 500 మంది మహిళలతో సామూహిక అష్టలక్ష్మీ వ్రతాలను చేయించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అమ్మవారికి పూజలు..

శ్రావణ మాసం చివరి మంగళవారం కావటంతో స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు పోటీ పడ్డారు. మంగళవారం ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలోనూ శ్రావణ మంగళవారం పూజలను ఘనంగా నిర్వహించారు.



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

వర్షబీభత్సం

● నీట మునిగిన పొలాలు ● రహదారులు జలమయం

ఎడతెరిపి లేని వర్షాలతో జిల్లా వ్యాప్తంగా పొలాలు నీటి మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రహదారులు జలమయమయ్యాయి. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదులకు వరద పోటెత్తింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. - ఆంధ్రజ్యోతి బృందం



జలుమూరు: వెలుసోదలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు



కొత్తూరు: మాకవరం-వీఎన్‌పురం వద్ద నీట మునిగిన పంటపొలాలు



పాతపట్నం: సూర్యనారాయణపురం కాలనీలో ఇంటిలోకి చేరిన నీరు



నరసన్నపేట: గొట్లిపల్లి వద్ద వరదనీటిలో మునిగిన పొలాలు



టెక్కలి రూరల్: పెద్దరోకళ్లపల్లిలో బైక్‌ను మోసుకొని వెళుతూ..



కోటబొమ్మాళి: గురువెల్లిపేట రైల్వే అండర్ పాస్ వద్ద వరదనీటిలో బాలుడిని మోసుకు వస్తూ..



కోటబొమ్మాళి: సీతన్నపేట వద్ద మంగళి గెడ్డ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



పాతపట్నం: కాజ్‌వేపై మహేంద్ర తనయ నది ఉధృతి



ఎల్ఎన్‌పేట: దబ్బపాడు-తురకపేట వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు శ్లాబ్



టెక్కలి: మండాపాలెం కాలనీలో వర్షపు నీరు

వాయు'గండం' గడిచింది

(ఐదో పేజీ తరువాయి)

సోమవారం అర్ధరాత్రి వరకు వరుస సమీక్షలతోపాటు మండలాల వారీగా ప్రజలను అప్రమత్తం చేశారు. ఏవిధమైన నష్టం వాటిల్లకుండా ముందస్తుగా జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు కూడా ప్రకటించారు. తీరప్రాంతం పొడవునా.. అధికారులు సైతం మకాం వేశారు. కానీ.. మంగళవారం పరిస్థితి తారుమారైంది. వాయుగుండం.. ఏమాత్రం ప్రభావం చూపకుండా వెళ్లిపోయింది. దీంతో హమ్మయ్య.. గండం గడిచిపోయిందంటూ జిల్లా ప్రజలు.. అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

● నీట మునిగిన పంట పొలాలు..

ఒడిశా నుంచి ఉప్పొంగి వరద నీరు జిల్లాలోని ప్రాజెక్టుల్లో చేరడంతో గొట్టా బ్యారేజీ, మడ్డువలస నుంచి అదనపు నీటిని బయటకు విడిచిపెట్టేశారు. దీంతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా పంట పొలాలు నీట మునిగే ఉన్నాయి. శ్రీకాకుళం, రణస్థలం, ఎచ్చెర్ల, నరసన్నపేట, పోలాకి, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి తదితర తీరప్రాంత మండలాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పంటను కాపాడుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

● జిల్లాకు రూ.కోటి మంజూరు..

జిల్లాలో వరద నివారణ చర్యలు.. ప్రభుత్వం తీసుకోవాల్సిన అత్యవసర పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో.. ఆహారం సమకూర్చడం.. వైద్యం.. ఇలా ఇతరత్రా సహాయ సహకారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది.

కోల్‌కతా టు తమిళనాడు

(ఐదో పేజీ తరువాయి)

వస్తాయి. ఆ రవాణాదారులకు మన రాష్ట్ర అనుమతులు ఏవీ లభించలేదు. ఇదిలా ఉండగా గతంలో కూడా విదేశాలకు చెందిన పాములు, కోతులతోపాటు అడవుల్లో సంచరించే అలుదు, తదితర వన్యప్రాణులు అక్రమ రవాణా అవుతూ పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా లాడ్జి సిబ్బంది ఫిర్యాదు చేయకపోతే పక్షులన్నీ ఆంధ్రా దాటి అమ్ముడుపోయేవని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై, టోల్‌గేట్ల వద్ద అటవీశాఖ అధికారులు మరింత నిఘా పెంచాలని కోరుతున్నారు.

అధికారుల తప్పిదం.. రైతుల పాలిట శాపం

(ఐదో పేజీ తరువాయి)

కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు వర్తించాయి. జాయింట్ ఎల్‌పీఎం కారణంగా 1బీ రాకపోవడంతో సుమారు 2,500 మంది రైతులు ఈ పథకాలకు నోచుకోలేకపోయారు. పట్టాదారు పుస్తకాలకు ఆధార్ నెంబరు అనుసంధానం కాకపోవడంతో మరికొంతమంది రైతులు ఆ పథకాలకు దూరమయ్యారు. ఈ సమస్యలపై సంబంధిత రైతులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండాపోయింది. అంతేకాకుండా మండల, జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచి ఆప్షన్ రాలేదు, సబ్ డివిజన్ చేయాలి.. మ్యుటేషన్ పెట్టుకోండి అని చెబుతున్నారని రైతులు అంటున్నారు. అధికారులు చెప్పినట్లు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కాలపరిమితి ఉన్నంత వరకూ 'అదిగో.. ఇదిగో.. అయిపోతుంది. తహసీల్దార్ వద్ద మీ దస్త్రం ఉందని చెప్పి ఆఖరులో రిజెక్టు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినప్పటికీ మండలంలో రెవెన్యూ పరమైన సమస్య ఒక్కటీ పరిష్కారమైన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమానికి రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి సుమారు 500 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో కనీసం పది కూడా పరిష్కారం కాలేదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

రహదారులిలా.. ప్రయాణమెలా?

● దారుణంగా ఉన్న రోడ్లు
● ఇబ్బందులుపడుతున్న వాహనదారులు, ప్రజలు

జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని రోడ్లు దారుణంగా ఉన్నాయి. అసలే గోతులు ఆపై ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నిలిచిన నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనాలు సైతం అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగునీటితో ఇక్కట్లు


రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఇచ్ఛాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సత్యసాయి బాబా మందిరం వీధిలో రోడ్లపై మురుగునీరు నిలిచిపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు కాలువలోని మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రజలు రాక పోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గోతుల్లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అడుగడుగునా గోతులే..


బీటీ రోడ్డుపై నిలిచిన నీటిని మళ్లిస్తున్న గ్రామస్థుడు

జి.సిగడాం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే బీటీ రహదారి అడుగ డుగునా గోతుల మయం కావడం, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు గోతుల్లో చేరి దారుణంగా ఉన్నాయి. గ్రామ శివారు నుంచి సుమారు 4 కిలోమీటర్ల మేర ఈ పరిస్థితి నెల కొంది. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షపు నీటి వల్ల గోతులు కనిపించక వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కనిమెట్ట సమీపంలో..


రోడ్డు గోతుల్లో చేరిన వర్షపు నీరు

పొందూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కనిమెట్ట సమీపంలో రోడ్డు దారుణంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోయింది. గోతుల్లో పడి దుస్తులు పాడవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

తోటవూరు వద్ద ఇలా..


కోతకు గురైన తోటవూరు గ్రామ రహదారి

సోంపేట రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామీణ రహ దారులకు కోతకు గురై కొట్టుకు పోయాయి. గతంలో గ్రావెల్ వేసి వదిలేసిన రోడ్లన్నీ ఈ వర్షాలకు దారుణంగా తయా రయ్యాయి. తోటవూరు-ఎకువూరు గ్రామాల మధ్య రోడ్డు 400 మీటర్లు మేర అడుగుడునా బురదమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని సిరిమా మిడి, ఉప్పలాం, మామిడిపల్లి, గొల్లవూరు, తురకశాసనం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పంటలబీమా వినియోగించుకోండి

కంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంట రుణం తీసుకున్న రైతులు పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు పైల పురుషోత్తం రెడ్డి, సీఈవో రామారావు ఒక ప్రకటనలో కోరారు. కంచిలి పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులందరూ ఈ నెల 28 లోగా పంటల బీమా కోసం పీఎం ఫసల్ బీమా యోజనలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మహాకుంభాభిషేకం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్స్ కాలనీ శివ బాలాజీ ఆలయంలో ఏకోత్తర సహస్ర కలశ స్నపన పూర్వక మహా కుంభాభిషేక ఉత్సవాలు మంగళవారం ప్రారంభ మయ్యాయి. తొలిరోజు విష్వక్సేన పూజ, పతాక ప్రతిష్ఠ, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు 22లోగా తెలియజేయాలి: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పలాస ఆర్డీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుకు ఈనెల 10న నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలు, మార్కుల జాబితాను 22న వెబ్‌సైట్‌లో ఉంచుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో అనుభవానికి సంబంధించిన ఎటువంటి అభ్యంతరాలున్నా ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా డీఆర్వోకి నేరుగా అందజేయాలన్నారు. అభ్యర్థులు వివరాలకు జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా నియామకానికి ఈ పరీక్ష నిర్వహించామన్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీ

గార రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గారలోని పలు దుకాణాలను మంగళవారం డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఎస్ఐ గంగరాజు మాట్లాడుతూ.. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా అవుతూ పట్టు బడుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. తూలుగు కూడలి వద్ద 'సంకల్పం' కార్యక్రమంలో మాట్లాడుతూ అపరిచితుల ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఆమదాలవలస, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి సూచించారు. మంగళవారం పట్టణంలోని మోణింగివారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. రోగులు తెలిపిన సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డా. బి.సురేష్‌కు సూచించారు. హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వయోడెక్ట్ లీకుల పరిశీలన

ఆమదాలవలస, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవసలోని వయోడెక్ట్‌ను శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష మంగళవారం పరిశీలించారు. వయోడెక్ట్ నుంచి నీరులీకవుతున్న ప్రదేశాలను చూశారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

సోంపేట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఈ పంటలో రైతులు పంటలు నమోదు చేసుకోవాలని ఏడీఏ టి.భవానీ శంకరరావు అన్నారు. మంగళ వారం పొత్రకొండ, కర్తలపాలెంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏవో నరసింహ మూర్తి, సర్పంచ్‌లు బేసి ఖగేశ్వరరావు, పొందూరు గున్నయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

అరసవల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ (బాపట్ల జిల్లా) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ కలర్ పోటీలో శ్రీకాకుళం 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బి.జోగారావు విజేతగా నిలిచారు. డాక్టర్ భగవాన్ దాస్ ఐఏఎస్, ఎఫ్‌పీఎస్ఏ, బండి రాజన్‌బాబు స్మారక 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలో జోగారావు ప్రథమ బహుమతి పొందారని అకాడమీ ప్రతినిధి కె.సుధాకరరెడ్డి తెలిపారు. విజేతలకు త్వరలో బహుమతిని అందజేస్తామని పేర్కొన్నారు. విజయనగరంలో 2003లో విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరసనలో విద్యార్థినుల పట్ల పోలీసుల చర్యలపై తీసిన చిత్రానికి ఈ బహుమతి వచ్చింది.



విద్యార్థిని పై పోలీసుల జులుం

బహుమతి వచ్చిన ఫొటో (ఇన్‌సెట్‌లో) జోగారావు

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఇంటి వద్దకే మట్టి విగ్రహం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితంగా గణేష్ చతుర్థి ఉత్సవాలను జరుపుకుందామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మట్టి విగ్రహాలను వాడడం ద్వారా నదీ జలాలు కలుషితం కాకుండా కాపాడ వచ్చన్నారు. ప్రకృతిని కాపాడే బాధ్యత మనందరిపై ఉంద న్నారు. ఈ పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఇంటి వద్దకే మట్టి విగ్రహాలు డెలివరీ చేస్తారన్నారు. ఈనెల 26న సూర్యమహల్ జంక్షన్ వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తామన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఉప కలెక్టర్లు పద్మావతి, జయదేవి, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ బి.కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ఎచ్చెర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్నా యని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. పొన్నాడ కేజీబీవీలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమం కేజీబీవీ ప్రిన్సిపాల్ సూర్యకళ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో జిల్లాకు పతకాలు


విజేతలను అభినందిస్తున్న డీఎస్‌డీవో

శ్రీకాకుళం స్పోర్ట్స్ ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారి ణులు పతకాలు సాధించారు. ఈనెల 17న విజయనగరం జిల్లా కొండవెలగాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 53 కేజీ కేటగిరిలో డి.యామశ్రీ బంగారు, 63 కేజీల కేటగిరిలో కె.హసిని కాంస్య, 77 కేజీల కేటగిరిలో టి.కావ్య రజిత పతకాలు సాధించారు. వీరిని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డా.కె.శ్రీధర్, వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు ఇ.అప్పన్న అభినందించారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ఆరు కేంద్రాల్లో ప్రారంభ మయ్యాయి. టెక్కలి, పలాస, రాజాం, పాలకొండతో పాటు శ్రీకాకుళం నగరంలోని రెండు కేంద్రాల్లో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు జరిగే పరీక్షలకు 14 బీఈడీ కళాశాలల నుంచి సుమారు 1,100 మంది విద్యార్థులు రాస్తున్నారు. ఈనెల 22వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్. ఉదయ భాస్కర్ తెలిపారు. ఈనెల 18న జరగాల్సిన మూడు, ఐదేళ్ల లా కోర్సులకు సంబంధించిన వివిధ సెమిస్టర్ పరీక్షలు వర్షం కారణంగా వాయిదా వేశామని, సెప్టెంబరు 2న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మహిళలు, దళితులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు విమర్శించారు. పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య ఆత్మహత్యాయత్నం చేసుకున్న నేపథ్యంలో మంగళవారం రిమ్స్‌లో ఆమెను జిల్లా వైసీపీ నేతలతో కలిసి పరామర్శించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళ అని చూడకుండా ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ ఇష్టానుసారంగా వేధించి తన అనుచరులతో ట్రోల్స్ చేయించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మె ల్యే రెడ్డి శాంతి, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎం.శ్రీకాంత్, ఎంవీపద్మావతి పాల్గొన్నారు.

క్లస్టర్ కళా ఉత్సవ్‌లో నవోదయ విద్యార్థుల ప్రతిభ

సరుబుజ్జిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 18, 19 తేదీల్లో ఆర్ట్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ కళా ఉత్సవ్ క్లస్టర్ స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో వెన్నెలవలస నవోదయ బాలికలు ప్రతిభ కనబరిచారు. గ్రూప్ పాటల పోటీలో బాలికలు ప్రథమ స్థానం దక్కించుకోగా, చిత్రలేఖనంలో మైథిలి విజేతగా నిలిచింది. అలాగే ప్రకాశం జిల్లా కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయం-2లో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల కళా ఉత్సవంలో డ్యాన్స్ విభాగంలో ద్వితీయ స్థానం పొందినట్లు చిత్రలేఖనం ఉపాధ్యాయుడు నల్లి ఆనందరాజ్ తెలిపారు. విజేతలు ఒంగోలులో త్వరలో జరగనున్న రీజనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ బేతనస్వామి తెలిపారు. విజేతలను ఆయన అభినందించారు.


గ్రూప్ పాటల పోటీలో విజేతలైన విద్యార్థినులు

పేదవాడి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్: ఎన్ఈఆర్


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని హైవేని ఆనుకుని క్యాంటీన్ భవన నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.60 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపడుతున్నామన్నారు. లావేరు, ఎచ్చెర్ల, జిసిగడాం మండలాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెర వేర్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదే నన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కూటమి నాయకులు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

● రిమ్స్ వద్ద ఖాళీ కంచాలతో సెక్యూరిటీ గార్డుల నిరసన


శ్రీకాకుళం రిమ్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ఏప్రిల్ నుంచి ఇవ్వాల్సిన వేతన బకాయిలను తక్షణం చెల్లించాలని, ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఫెడరేషన్ నాయకుడు బి.మురళి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) వద్ద కార్మికులు ఖాళీ కంచాలను పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. వేతనాలను చెల్లించాల్సిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తుండగా ఆసుపత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టు కొస్తున్నారని, ఈ దిశలో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేయించుకోవడంలో అధికారులు శ్రద్ధ వహిస్తున్నారు కాని కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల విషయంలో బాధ్యత తీసుకోకపోవడం బాధాకరమన్నారు. జిల్లా అధికారులు స్పందించి తక్షణం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని రిమ్స్ సూపరింటెండెంట్ డా.సి. అమూల్యకు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సూర్యనారాయణ, కె.రవి, సంతోషి, సావిత్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ కార్మికులు

మెరుగైన బోధన అందించాలి

పాత శ్రీకాకుళం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులకు మెరుగైన బోధనతో పాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఎస్ఏ ఏపీసీ డా.ఎస్.శశిభూషణ్ సూచించారు. మంగళవారం ప్రాజెక్టు కార్యా లయంలో 25 కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, ఏఎన్ఎంలతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఎఫ్ఏ-1 పరీక్షలు, విజయపథం అమలు, ఉపాధ్యాయ డైరీ, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నివారణ చర్యలపై చర్చించారు. జిల్లాలోని ఒక్కో కేజీబీవీల్లో చదువుతున్న ఇద్దరు చొప్పున అనాథ విద్యార్థినులకు రూ.500 వంతున రూ.25 వేలు, నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధపడుతున్న మెరిట్ విద్యార్థినికి రూ.1000 చొప్పున రూ.25 వేలు.. మొత్తం రూ.50 వేల చెక్కును సంబంధి త ప్రిన్సిపాళ్లకు అందించారు. కార్యక్రమంలో డీఈవో ఎ.రవి బాబు, డీఎం హెచ్‌వో డా.కె.అనిత, ఎస్ఎస్ఏ అకౌంట్స్ అధికారి కె.ప్రసాదరావు, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ మార్గంలో జీవించాలి



శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో జీవించాలని చిన్మయి మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిద్రూపానంద సరస్వతి అన్నారు. స్థానిక బాపూజీ కళామందిరంలో జ్ఞాన ప్రవచన యజ్ఞం రెండోరోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. పాలకులు ప్రజలకు మంచి పరిపాలన అందించాలన్నారు. సత్వ గుణం కలిగి ఉండాలన్నారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు ఉపదేశించిన సందేశాలు వింటే జీవితం గమ్యం ఏంటో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో మిషన్ శ్రీకాకుళం విభాగం నిర్వాహకుడు పరమాత్మానంద సరస్వతి, ఆధ్యాత్మికవేత్త నిష్టల నరసింహమూర్తి, తోటపల్లి జట్టు ఆశ్రమం ప్రతినిధి పారినాయుడు, పట్టణ ప్రముఖులు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, అందవరపు ప్రసాద్, రామకృష్ణ, విశ్వేశ్వరరావు, డా. మందుల మోహన్‌రావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి


లూయిస్ డాగురే విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్య క్షుడు మెట్ట నాగరాజు అన్నారు. ప్రపంచ 186వ ఫొటో గ్రఫీ డేని మంగళవారం ఓ స్టూడియోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితా మహుడు లూయిస్ డాగురే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేణు, సంఘ ప్రతినిధులు శ్రీను, వెంకటేష్, రవి, యుగంధర్, చిరంజీవి పాల్గొన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సత్కారం

ఎచ్చెర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఎచ్చెర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ట నాగరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీని యర్ ఫొటోగ్రాఫర్లు ఎస్.చిరంజీవి, టి.భానుమూర్తి, ఎం.గోపాల్, జి.కుమార్, పి.సూరిబాబులను సత్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు ఐవీ రమణ, కొండలరావు, బాలరాజు, సురేష్‌బాబు, హేమ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలిలో రక్తదానం


రక్తదాతను అభినందిస్తున్న అధికారులు

కంచిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఉద్దానం ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంచిలి మార్కెట్ యార్డు వద్ద మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు. రక్తదాతలను తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, సోం పేట సీఐ బి.మంగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో జి.వీరభద్రస్వామి అభినందించారు. అనంతరం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పొట్నూరు రాజశేఖర్, నరసింహ, శ్యామ్‌బాబు, జగదీష్, కృష్ణ, నియోజకవర్గంలోని ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆమదాలవలస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ హిస్టరీ ఆనర్స్ 40 సీట్లు, బీఏ (పాలిటిక్స్) ఆనర్స్ 40, బీకాం కంప్యూటర్స్ ఆనర్స్ 60 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తుల రిజిస్ట్రేషన్ కోసం అన్ని సర్టిఫికేట్లతో కళాశాల ఆఫీసులో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

అయ్యో చిన్నారి

- కంపోస్టు గోతిలోపడి బాలుడి మృతి
- తల్లి కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వైనం


లోకేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జలుమూరు (సారవకోట) ఆగస్టు 19: (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు ఆ చిన్నారి తప్పటడుగులు వేస్తూ తల్లి కొంగు పట్టుకొని తిరిగాడు. కొంతసేపటి తరువాత తల్లి పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఆ చిన్నారి..తల్లిని వెతుక్కుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చి కంపోస్టు ఎరువు తయారీ కోసం తవ్విన గోతిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన సారవకోట మండలం బద్రి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. శిమ్మ దాలినాయుడు, హేమలత దంపతులకు ఇద్దరు కుమారులు మౌళి, లోకేశ్(3) ఉన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా ఈ ఏడాది గ్రామంలోని ప్రతీ ఇంటివద్ద పెరటి భాగంలో కంపోస్టు గోతులు తవ్వారు. గత మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు ఆ గోతులు నీటితో నిండిపోయాయి. అయితే, మంగళవారం ఉదయం హేమలత తన పిల్లలను ఇంటి వద్ద విడిచిపెట్టి పని నిమిత్తం బయటకు వెళ్లింది. చిన్నకుమారుడు లోకేశ్ తల్లి కోసం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఆమెను వెతుకుతూ తన ఇంటికి సమీపంలో ఉన్న కంపోస్టు గోతిలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ చూడకపోవడంతో నీటిలో మునిగి ఊపిరి అందక చనిపోయాడు. పనిపై వెళ్లిన హేమలత ఇంటికి వచ్చి బాలుడి గురించి ఆరా తీసింది. ఎక్కడా కనిపించకపోవడంతో గ్రామంలో వెతికారు. కంపోస్టు గోతిలో శవమై తేలి కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లోకేశ్ మృతిపై కుటుంబ సభ్యులు ఉపాధిహామీ ఏపీవోకు, ఎంపీడీవో మోహన్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

రాధాసాగరంలో వ్యక్తి గల్లంతు


రాధాసాగరంలో గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం


రామారావు (ఫైల్)

మెళియాపుట్టి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గోకర్ణపురం పంచాయతీ చిన్నహంస గ్రామానికి చెందిన లండ రామారావు (48) అనే వ్యక్తి ఒడిశాలోని లావణ్యకోట సమీపంలో ఉన్నా రాధాసాగరంలో గల్లంతైనట్టు భార్య భాగ్యలక్ష్మి తెలిపింది. కుటుంబ సభ్యులు, ఒడిశాలోని గారబంద పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం మధ్యాహ్నం చిన్నహంస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రాధాసాగరం పరిసర ప్రాంతంలో పార్టీ చేసుకుందామని రామారావును తీసుకెళ్లారు. చేపల పెంపకందారులు మేత వేయటానికి తెప్పను సాగరం పక్కన ఉంచారు. దీంతో ఇద్దరు యువకులతో పాటు రామరావు పార్టీ చేసుకున్న తరువాత బోటు షికారు చేశారు. బోటు తిరగబడడంతో రామారావు మునిగిపోయినట్టు చెబుతున్నారు. సోమవారం రాత్రి రామారావు ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు గాలించారు. అనంతరం కుటుంబ సభ్యులు ఇద్దరు యువకులను నిలదీయడంతో బోటు తిరగబడి రామారావు బురదలో కురుకుపోయినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు గారబంద పోలీసులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం ఒడిశాలోని అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను తీసుకువచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. రోజంతా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఒడిశాలో అధికంగా వర్షాలు పడుతుండంతో సాగరానికి నీరు పోటెత్తుతోంది. సాగరంలో పెద్దపెద్ద చెట్లు... పిచ్చి మొక్కలు ఉండడం వల్ల గాలింపునకు ఇబ్బంది ఎదురవుతున్నట్టు ఒ డిశా పోలీసులు చెబుతున్నారు. రామారావుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష

ఎచ్చెర్ల, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ప్రమాదానికి కారకుడైన ఓ లారీ డ్రైవర్ కు 60 రోజుల జైలుశిక్షను విధిస్తూ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంకు చెందిన డ్రైవర్ నాగరాజు మద్యం సేవించి సోమవారం అర్ధరాత్రి సిమెంట్ లోడుతో లారీని నడుపుతూ రాంగ్‌రూట్‌లో వస్తూ ఎదురుగా వస్తున్న లారీని కింతలిమిల్లు జంక్షన్ జాతీయ రహదారిపై ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్, క్లీనర్లు గాయపడ్డారు. ఈ మేరకు డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందితుడు నాగరాజును మంగళ వారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఈ శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మవారి ఆలయాల్లో చోరీ

నందిగాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలోని రెయ్యిబోడమ్మ, భూలోకమ్మ అమ్మవారి ఆలయాల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం పూజలు చేసేందుకు ఈ ఆలయాలకు వెళ్లిన భక్తులు అక్కడ చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్థులకు సమాచారం అందించారు. రెండు శఠగోపాలతో పాటు పూలసజ్జలు, బిందెలు, పళ్లెంలు, దీపం స్తంభాలు దొంగతానికి గురయ్యాయని, వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో చోరీయత్నం నిందితురాలు?

మెళియాపుట్టి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టుపురం గ్రామానికి చెందిన అంబల కాంచన ఇంటిలో చోరీకి యత్నించిన కేసులో నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 14న కాంచన తన ఇంటికి తాళాలు వేసి గుడికి వెళ్లింది. గుడి నుంచి తిరిగి వచ్చేసరికి తన ఇంటి తాళాలను గుర్తుతెలియని మహిళ పగులగొడుతుండడాన్ని చూసి కేకలు వేసింది. దీంతో ఆ మహిళ ఇసుప రాడ్డుతో కాంచన తలపైకొట్టి ఒడిశా రిజిస్ట్రేషన్ గల ద్విచక్ర వాహనంపై పరారైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పాతపట్నం సీఐ రామారావు, ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం నిందితురాలిని పట్టుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. దీన్నిపై ఎస్ఐ రమేష్‌బాబును వివరణ కోరగా.. 'కేసు దర్యాప్తు చేస్తున్నాం. మరిన్ని వివరాలు సేకరిస్తున్నాం'. అని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం తీరం దాటినా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలాస నియోజకవర్గ ప్రత్యేకాధికారి డి.మధుసూదనరావు పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒడిశా తీరంలో వాయుగుండం తీరం దాటినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సీతారామయ్య, ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు, డీటీ బి.మురళీకృష్ణ, వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డెవిడ్‌బూన్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించిన వారికి చాక్లెట్

పలాస, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత ప్రత్యేక వారోత్సవాల సందర్భంగా మంగళవారం హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు చాక్లెట్లు అందించారు. ప్రజలకు అవగాహన కల్పిం చడం, వారి బాధ్యత గుర్తు చేయడానికి ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎరువులు ఎప్పుడిస్తారు?

- అధికారులను నిలదీసిన సభ్యులు
- వాడీవేడిగా మండల సమావేశం


మాట్లాడుతున్న సభ్యులు

పాతపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు ఎప్పుడు ఇస్తారంటూ మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీటీసీ కొండాల యరకయ్య, జడ్పీటీసీ లింగాల ఉషారాణి, తూలుగు ప్రవీణ్, పోలాకి రేణుక తదితరులు మాట్లాడుతూ.. యూరియా అందక రైతు లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎరువులను సరఫరా చేయడంలో వ్యవసాయాధికారులు వైఫల్యం చెందారని పేర్కొన్నారు. ఏవో కిరణ్‌వాణి మాట్లాడుతూ.. 'మండలంలో 15,600ఎకరాల్లో వరిసాగవుతుంది. దీనికి 700 మెట్రిక్ టన్నుల యూరియా, 700 మెట్రిక్‌టన్నుల డీఏపీ, 519 మెట్రిక్‌టన్నుల పొటాష్ అవసరం ఉంటుంది. ఇప్పటి వరకు రైతులకు 370 మెట్రిక్ టన్నుల యూరియా, 80 మెట్రిక్ టన్నుల డీఏపీని రైతు సేవాల కేంద్రాల ద్వారా అందించాం. రెండు, మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో ఎరువులు వస్తాయి. వచ్చిన వెంటనే రైతులకు సరఫరా చేస్తాం'అని తెలిపారు. మేజర్ పంచాయతీ పాతపట్నంలో శ్మశానవాటిక నిర్మాణాల పనులు ఒక్కటైనా జరగలేదంటూ పలువురు సభ్యులు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోను నిలదీశారు. పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలను మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు రిజర్వు ఫారెస్టుకు ఆనుకొని ఉన్న ట్రెంచ్‌లు కొట్టేయడంతో సూర్యనారాయణపురం గ్రామంలోని ఇళ్లలోకి నీరుచేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని సభ్యులు వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అటవీ శాఖాధికారి అజయ్ తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, మండలప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్ర

- రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణంనాయుడు


మాట్లాడుతున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణంనాయుడు తదితరులు

నరసన్నపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్ర చేస్తుందని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకుల డైరెక్షన్‌లో పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య సరికొత్త డ్రామాకు తెరతీశారన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా అధికారులు సౌమ్యను బదిలీ చేశారని, దీన్ని ఆమె మనసులో పెట్టుకొని రవికుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. దీన్ని తామంతా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కాళింగ సంక్షేమ సంఘ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు, జల్లు చంద్రమౌళి, కరుకోల రమేష్‌బాబు, ఉప్పాడ పూర్ణారావు, సీపాన త్రినాథరావు, కిల్లి లక్ష్మణరావు, జి.గోపాలరావు, సువ్వారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏకు తొత్తుగా ఎన్నికల కమిషన్

- కేంద్ర మాజీ మంత్రి కృపారాణి


మాట్లాడుతున్న కృపారాణి

టెక్కలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల కమిషన్ ఎన్డీఏ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తుందని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఆరోపించారు. మంగళవారం టెక్కలిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఓ రాజకీయ పార్టీ నాయకుడిలా, బీజేపీ అధికార ప్రతినిధిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఓట్ల చోరీపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవాలు వివరిస్తే, దానికి వివరణ ఇవ్వాల్సిన సీఈసీ వక్రీకరించి మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ ఈ విధంగా దిగజారుతుందని దేశ ప్రజలు ఏనాడూ భావించలేదని అన్నారు.

ఇదేం పని?

- ప్రైవేట్ కమర్షియల్ కాంప్లెక్స్‌కు ప్రభుత్వ బోరు నుంచి పైపులైన్
- దీనికోసం సీసీ రోడ్డు ధ్వంసం


రోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

కాశీబుగ్గ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల కిందట కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో అధికారులు ఒక పవర్ బోరును ఏర్పాటు చేశారు. సమీప నివాసితులతో పాటు వ్యాపారులకు ఈబోరు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. అయితే, మంగళవారం ఓ ప్రైవేట్ కమర్షియల్ కాంప్లెక్స్‌కు ఈ పవర్ బోర్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు కొందరు వ్యక్తులు వీధిలోని సీసీ రోడ్డును ధ్వంసం చేశారు. స్థానికులు ఇదేం పని ప్రశ్నిస్తే వారితో వాగ్వాదానికి దిగారు. రోడ్డును తవ్వడం వల్ల ప్రస్తుతం అక్కడ రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో అడ్డగోలు వ్యవహారాలు నడుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

అవయవ, శరీర దానానికి యువకుల అంగీకారం


రిమ్స్‌లో అవయవ, శరీర దానం పత్రాలు అందిస్తున్న విజయకుమార్, శ్రీనివాస్

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, అఖిలభారత శరీర, అవయవదాన జిల్లా జాయింట్ కార్యదర్శి, ఆర్మీ ఉద్యోగి కీలు విజయకుమార్‌తో పాటు శ్రీనివాస్ అనే యువకుడు అవయవ, శరీర దానానికి ముందుకువచ్చారు. ఈ మేరకు సంబంధిత అంగీకార పత్రాలను జిల్లా ప్రభు త్వ వైద్య కళాశాల అధికారికి మంగళవారం అందించారు. మృతి చెందిన తరువాత అగ్నికి ఆహుతి అవ్వడం కన్నా వైద్య విద్యార్థులకు తమ శరీరం ఒక ప్రయోగశాల కావాలనే ఉద్దేశంతో అవయవ, శరీర దానానికి అంగీకరించినట్లు వారు చెప్పారు. ప్రతిఒక్కరూ మూఢనమ్మకాలు విడిచి అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రద్దయిన పింఛన్లపై చర్యలు తీసుకోండి

పలాస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రద్దయిన దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి ఎవరైనా అర్హులు ఉంటే మళ్లీ వారితో దరఖాస్తులు చేయించి పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. మంగళవారం సచివాలయాల వెల్ఫేర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రద్దయిన పింఛనుదారులతో మాట్లాడి వారిలో మనోధైర్యాన్ని నింపాలని కోరారు.

రైతు సంక్షేమాన్ని కాపాడింది కూటమి సర్కారే

టెక్కలి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమాన్ని కాపాడింది కూటమి సర్కారేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు రామకృష్ణ అన్నారు. మంగళవారం టెక్కలిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. యూరియా సకాలంలో రైతులకు అందడం లేదని తిలక్ చెప్పడం పచ్చి అబద్ధమని అన్నారు. దేశవ్యాప్తంగా యూరియా వాడకాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించి, నానో యూరియాను ప్రోత్సహిస్తుందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో కింగ్, పోలాకి షణ్ముఖరావు, ప్రసాదరెడ్డి, ప్రీతీష్, ప్రఫుల్లా, కిరణ్‌లు ఉన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికే 'ఆదికర్మయోగి'

మందస,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల సత్వర అభివృద్ధి కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదికర్మయోగి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంటీలు రవీంద్ర, ఇబ్రహీమ్ తెలిపారు. మందస మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎంఈలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాలపై గిరిజనులకు అవగాహన కలిగించి, వాటి ఆవశ్యకతను తెలియజేయడమే ఆదికర్మయోగి కార్యక్రమం ఉద్దేశమని డీఎంటీలు అన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరక్టర్ సీతారామ్ మందస, పలాస, కంచిలి, నందిగాం, లావేరు మండలాలకు చెందిన బీఎంటీలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి గ్రామోత్సవం అర్చకులు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం బహుళ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి దర్శనం భక్తులకు కల్పించారు. గ్రామోత్సవంలో భక్తులు, మహిళలు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి మంగళ హారతులు అందించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, అప్పారావు, అచ్యుత, యోగి, శివ, దేవాదాయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

డీసీసీబీ కోసం స్థల పరిశీలన


స్థానిక అధికారులతో మాట్లాడుతున్న జేసీ

కోటబొమ్మాళి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నిర్మాణం కోసం కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు పార్కు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ ఆహ్మద్ ఖాన్ మంగళవారం పరిశీలించారు. ఈ స్థలం స్థానిక ఎంపీయూపీ పాఠశాలకు చెందినదని, బ్యాంకు నిర్మాణం కోసం తమకు అప్పజెప్పాలని, స్థానిక మండల విద్యాశాఖాధికారి గోవిందరావుకు గతంలో సంబంధిత అధికారులు కోరారు. ఈ మేరకు జేసీ ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. ● మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటబొమ్మాళి పెద్దచెరువు గండి పడడంతో ఆర్డీవో ఎస్. కృష్ణమూర్తి రెవెన్యూ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. భారీ వర్షాలకు ప్రజలకు కలిగిన నష్టాలు, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

విధుల నుంచి తొలగించడం అన్యాయం


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగులు

కాశీబుగ్గ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):ఉద్దానం ప్రాజెక్టులో 27 సంవత్సరాలుగా సేవలు చేస్తున్న తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆ ప్రాజెక్టు ఉద్యోగులు అన్నారు. మంగళవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నాలుగో రోజు నిరసన దీక్ష శిబిరం కొనసాగించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్దానం ప్రాజెక్టు అధ్యక్షుడు కె.నీలాచలం మాట్లాడుతూ.. తొలగించిన ఉద్యోగులను తక్షణమే విధులోకి తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. ఈ నిరసనలో గౌరవ అధ్యక్షుడు వెంకటరమణ, జోగారావు, రాజా చంద్రశేఖర్, హేమసుందర్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో వైద్యశిబిరం

కొత్తూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొత్తూరు రెల్లివీధిలో మంగళవారం కురిగాం వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్ వైద్య శిబిరం నిర్వహించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తినాలని సూచించారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి , హెల్త్‌సూపర్‌వైజర్ బుజ్జిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించాలి

పోలాకి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంటకు క్రాప్‌ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని పోలాకి సహకార సొసైటీ చైర్మన్ బైరి భాస్కరరావు, సీఈవో బి.రాంబాబు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. 2025 ఆర్థిక సంవత్సరానికి ఒక ఎకరా విస్తీర్ణానికి రూ.170 చొప్పున క్రాప్‌ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. లేదంటే బీమా వర్తించదని అన్నారు. పోలాకి సహకార సొసైటీ ద్వారా రుణాలు తీసుకున్న రైతులంతా ఈ నెల 30గా ప్రీమియం డబ్బులు చెల్లించాలని సూచించారు.

స్వల్పంగా పెరిగిన వంశధార

హిరమండలం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంశధార నదిలో వరద నీరు చేరుతుంది. గొట్టాబ్యారేజీ వద్ద నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. మంగళవారం సాయంత్రానికి బ్యారేజీ వద్దకు 22వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుంది. 19,221 క్యూసెక్కులు నీటిని సముద్రంలోకి అధికారులు విడిచిపెడుతున్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1430 క్యూసెక్కులు నీటిని విడిచిపెడుతున్నారు. కుడి ప్రధాన కాలువ గేట్లు మూసివేశారు.

నానో యూరియాతో పంటలకు ప్రయోజనం

నందిగాం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో పంటకు ప్రయోజనం సమకూరుతుందని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. మంగళవారం బోరుభద్ర పంచాయతీ ఎంకన్నపేటలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియా ఎకరాకు అరలీటరు వాడడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులకు వివరించారు. 200లీటర్ల నీరు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పంటల బీమా, వరి యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం క్షేత్ర సందర్శన చేసి రైతులకు వివరించారు.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

పోలాకి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు యూరియా ఎరువు వాడకాన్ని తగ్గించాలని, లేకుంటే భూసారం తగ్గిపోతుందని వ్యవసాయాధికారి చిరంజీవి అన్నారు. మంగళవారం పోలాకి సచివాలయ ప్రాంగణంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరినారు, ఎదలు వేసే రైతులు ముంపునీటి నుంచి అప్రమత్తం కావాలన్నారు. రైతులు సాగుపరంగా ఎదుర్కొంటున్న తమ సమస్యలను తెలియచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, తూలుగు అశోక్‌కుమార్, ఏఈవో సాయి ప్రసన్నకుమార్, టి.శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గాను విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శాంతిహేమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ కెమిస్ట్రీ, గణితం, బోటనీ, జువాలజీ కోర్సులు, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏలో ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు నేరుగా హాజరుకావాలని సూచించారు.

నారాయణవలస సంత వేలం పాట ఖరారు

కోటబొమ్మాళి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గత మూడు నెలలుగా వాయిదాలు పడుతూ వచ్చిన నారాయణవలస పశువులసంత వేలం పాట ఎట్టకేలకు ఖరారైంది. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వేలం పాట నిర్వహించగా జలుమూరు మండలం పెద్ద దూగాం గ్రామానికి చెందిన తర్ర గణపతిరావు రూ.80.10లక్షలకు సొంతం చేసుకున్నారు. గణపతిరావు ఈ నెల 21 నుంచి 2026 మార్చి 31వరకు 32 వారాలు పాటు సంతలో ఆశీలు వసూలు చేసుకోవచ్చునని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

108కు నీడ కల్పించండి

నరసన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట కేంద్రంలోని 108వాహనానికి నీడ సౌకర్యం కల్పించాలని ఆ వాహన సిబ్బంది మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 108 వాహనం నిలుపుదలకు అవకాశం ఉన్న ప్రాంతాన్ని కేటాయించాలని సిబ్బంది రమణయ్య తదితరులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే బగ్గు సానుకూలంగా స్పందించారు.

కోరికలతో శాంతి మాయం

నరసన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'ప్రతి మానవజీవితం ఉత్కృష్టమైనది. కానీ ప్రస్తుతం మానవుల్లో కోరికలు అధికమయ్యాయి. దీంతో జీవితంలో శాంతిని కోల్పోయి వారిలో ద్వేషం, అసూయ పెరిగింది.' అని చిన్మయ మిషన్ స్వామీజీ చిద్విపానందసరస్వతి అన్నారు. మంగళవారం స్థానిక చిన్మయ మిషన్ నరసన్నపేట ఆశ్రమంలో రామాయణంలో విభీషణ గీతపై ఆయన ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో స్వామి పరాత్మనంద, ఉణ్న రంగనాథ్, సోమేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఉణ్న వెంకటేశ్వరరావు, కేఎల్ఎన్‌మూర్తి, వారణాశి సంతోషి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్లను ఆదుకోవాలి

నరసన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) వీడియో, ఫొటో గ్రాఫర్లకు ఉపాధి మార్గాలను కల్పించి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘ నాయకులు పుచ్చల ప్రసాదరావు, ధర్మారావు కోరారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో లూయిస్ డాగుర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణంలోని ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

●పాతపట్నం: పాతపట్నంలో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. డాగుర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఫొటో అండ్ వీడియోగ్రఫీ నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు తూలుగు భుజంగరావు, సభ్యులు రాము, రమణ, గోపి, మధు, శంకర్, సాయి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

సంతబొమ్మాళి,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నౌపడ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ కంటి పరీక్షలు నిర్వహించారు. 179 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి 11 మందికి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. నౌపడ పీహెచ్‌సీ వైద్యాధికారి పరిమళ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి.ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన మండల వేణు అనే విద్యార్థికి వీఫర్‌నీడి సంస్థ మంగళవారం ఆర్థికసాయం చేసింది. వేణు వైద్యఖర్చుల కోసం రూ.20వేలు అందజేసింది. కార్యక్రమంలో మనబడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డిసూరిబాబు,గేదెల శివారెడ్డి,ఇప్పిలి అప్పన్న పాల్గొన్నారు.

26న మండల సమావేశం

పలాసరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న మండల సర్వసాధారణ సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మందస, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ ఈవో బి.నవీన్‌కుమార్ అన్నారు. మందస సచివాలయం ఆవరణలో వైద్య సిబ్బందితో మందులను పంపిణీ చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, బ్లీచింగ్ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.